క్లుప్తంగా

మధ్యవర్తిత్వం.. కేసుల పరిష్కారానికి మార్గం

- జడ్జి రామ్‌గోపాల్



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి రామ్‌గోపాల్

తిరుపతి లీగల్: మధ్యవర్తిత్వం కేసుల పరిష్కారానికి మార్గమని, ఈ దిశగా న్యాయవాదులు సహకరించాలని తిరుపతి ఐదవ అదనపు జిల్లా జడ్జి జి.రామ్‌గోపాల్ కోరారు. గురువారం తిరుపతి న్యాయవాదుల అసోసియేషన్ హాల్‌లో మధ్యవర్తిత్వంపై సమావేశాన్ని తిరుపతి మండల న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగాజడ్జి రామ్‌గోపాల్ మాట్లాడారు. ఇరు పక్షాల నడుమ మంచి వాతావరణంలో మధ్యవర్తిత్వంతో కేసులను పరిష్కరిస్తే న్యాయవాదులకు ఎలాంటి నష్టముండదన్నారు. మధ్యవర్తిత్వంపై ఢిల్లీకి చెందిన మాజీ న్యాయమూర్తి హరీష్ దుడాని న్యాయవాదులకు వివరించారు. జిల్లా న్యాయ సేవ సంస్థ కార్యదర్శి ఎంఎస్ భారతి, తిరుపతి న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి మార్టిన్, న్యాయవాదులు పాల్గొన్నారు.

నేడు జేసీఐ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం



మాట్లాడుతున్న జేసీఐ అధ్యక్షుడు శేషసాయి

తిరుపతి కల్చరల్: మంగళం రోడ్డులోని రామీ గెస్ట్‌లైన్‌లో శుక్రవారం సాయంత్రం 6 గంటలకు జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్(జేసీఐ) నూతన కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవం నిర్వహిస్తున్నట్లు జేసీఐ నూతన అధ్యక్షుడు ఆర్.శేషసాయి తెలిపారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జేసీఐ జాతీయ ఉపాధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి, జోన్ అధ్యక్షుడు టి.భరత్‌కుమార్, అడ్మినిస్ట్రేటివ్ కమిటీ సభ్యుడు జీఎల్ మనోహర్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తదితరులు ముఖ్య అతిథులుగా నూతన కమిటీతో ప్రమాణ స్వీకారం చేయిస్తారని తెలిపారు. జేసీఐ ఉపాధ్యక్షుడు రత్నశేఖర్, కోశాధికారి దిలీప్‌రెడ్డి పాల్గొన్నారు.

'భవిత'లో విద్యార్థుల నమోదు పెంచాలి



దివ్యాంగ పిల్లల విద్యా సామర్థ్యాలను పరిశీలిస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

పాకాల: మండలంలోని దివ్యాంగులను గుర్తించి భవిత కేంద్రంలో నమోదు పెంచుకోవాలని జిల్లా సహిత విద్య సమన్వయకర్త చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక భవిత కేంద్రాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. కేంద్రంలో సహిత ఉపాధ్యాయులు నేర్పుతున్న విద్యా నైపుణ్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సహిత ఉపాధ్యాయులు ఎం.మునికృష్ణారెడ్డి, కెఐస్ఎల్ సుందరి, సీజీవీ శరణ్య పాల్గొన్నారు.


బాల్య వివాహాల కట్టడి అందరి బాధ్యత



ర్యాలీ చేస్తున్న రైతు సాధికారత సంస్థ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు

రామచంద్రాపురం: బాల్యవివాహాలు చేయకుండా కట్టడి చేయడం అందరి బాధ్యత అని కుప్పంబాదూరు ఉన్నత పాఠశాల హెచ్ఎం సుజనా కుమారి అన్నారు. గురువారం కుప్పంబాదూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు జెండర్ అథారిటీ హింసకు వ్యతిరేకంగా జరుగుతున్న జాతీయ ప్రచారంలో భాగంగా రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు, హెచ్ఎం మాట్లాడుతూ, బలవంతపు వివాహాలు, బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని, అందరి కృషితోనే దీనిని అరికట్టగలమన్నారు. కార్యక్రమంలో రైతు సాధికారత సంస్థ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘాట్ రోడ్‌లో హెల్మెట్ తప్పనిసరి



తిరుమలలో వ్యాపారులకు కరపత్రం ఇస్తున్న ట్రాఫిక్ పోలీసులు

తిరుమల: తిరుమల ఘాట్ రోడ్లలో ప్రయాణించే ద్విచక్ర వాహనచోదకులు హైకోర్టు ఉత్తర్వుల మేరకు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని తిరుమల ట్రాఫిక్ సీఐ ఆధ్వర్యంలో పోలీసులు సూచించారు. ఆమేరకు తిరుమలలో ఉన్న టీటీడీకి సంబంధించిన అన్ని విభాగాలకు, హోటళ్లు, దుకాణాలు, మఠాలు, వ్యాపారులకు గురువారం పోలీసులు ప్రత్యేకంగా హైకోర్టు ఉత్తర్వులను తెలియజేశారు. ఇకపై తిరుమల ఘాట్ రోడ్డులో హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

వెంకట శివా! ఇదేం పని..?

- సీ.గొల్లపల్లెలో పంచాయతీ కార్యదర్శి ఓవరాక్షన్
- సిట్టింగ్ బెంచ్‌లపై నాటి తుడా చైర్మన్ చెవిరెడ్డి పేరుపై రంగులు
- వైఎస్సార్ రోడ్డు సూచిక బోర్డులు సైతం...
- పెద్ద మేడమ్ చెప్పారట.. వాటి ఆనవాళ్లు లేకుండా చేయాలట!
- మండిపడుతున్న గ్రామస్తులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు





సీ.గొల్లపల్లె పంచాయతీ కార్యాలయం వద్ద సిట్టింగ్ బెంచ్‌లపై ఉన్న చెవిరెడ్డి పేరుపై పూసిన సిమెంట్ పూత

తిరుపతి రూరల్: 'పంచాయతీలో ఎక్కడా మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పేరు కనిపించకూడదు.. ఆయన అభివృద్ధి పనులు చేసినా సరే... ఆయన పేరుతో ఉన్న బోర్డులను తొలగించండి.. తొలగించడం కష్టం అయితే కనపడకుండా పెయింట్ పూయండి...లేకుంటే సిమెంట్‌తో కప్పివేయండి...' అంటూ తిరుపతి రూరల్ మండలం సీ.గొల్లపల్లె పంచాయతీ కార్యదర్శి వెంకటశివ కింద స్థాయి సిబ్బందికి జారీ చేసిన ఆదేశాలు చర్చనీయాంశమయ్యాయి. ఆయన విధి నిర్వహణ మాటెలా ఉన్నా గ్రామానికి చెందిన చోటా నేత మెప్పు కోసం మరీ ఫక్తు రాజకీయ నేతగా ఓవరాక్షన్ చేస్తున్నాడని వెంకటశివ వ్యవహారశైలిపై ప్రజలు మండిపడుతున్నారు. నాడు తుడా చైర్మన్ హోదాలో చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చంద్రగిరి నియోజకవర్గ వ్యాప్తంగా స్థానికుల సౌకర్యార్థం సిట్టింగ్ బెంచ్‌లను ఏర్పాటు చేయించారు. ప్రతి పంచాయతీలో కనీసం 10 నుంచి 30 వరకు వేయించారు. ఇవి స్థానికులకు ఎంతో సౌకర్యంగా ఉంటున్నాయి.

వెంకటశివ వచ్చిన తర్వాతే...బరి తెగింపు

ఇటీవల జరిగిన బదిలీల్లో సీ.గొల్లపల్లె సచివాలయానికి పంచాయతీ కార్యదర్శిగా వెంకటశివ వచ్చాడు. ఆయన బదిలీపై వచ్చిన తర్వాతే గ్రామంలో రాజకీయ కక్షలకు తెరతీస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. విమర్శలకు బలం చేకూర్చేలా సిట్టింగ్ బెంచ్‌లపై మాజీ తుడా చైర్మన్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పేరును సిమెంట్‌తోనూ, రంగులతోనూ కనపడకుండా చేశారు. రెండు రోజుల క్రితం పంచాయతీలో సిట్టింగ్ బెంచ్‌లపై ఉన్న చెవిరెడ్డి పేరుపై సిమెంట్‌ను దగ్గరుండి పూయించారు. గ్రామంలో అభివృద్ధి పనులకు వేసిన శిలాఫలకాలు, బోర్డులను సైతం తొలగించి, ధ్వంసం చేయించారు. దీనిని స్థానికులు అడ్డుకోవడంతో 'పెద్ద మేడమ్ చెప్పారు'...అంటూ దాటవేశారు. దీనిపై డీపీఓ సుశీలాదేవి, ఎంపీడీఓ రామచంద్రను వివరణ కోరగా.. మాజీ ప్రజాప్రతినిధుల పేర్లు, సూచిక బోర్డులను తొలగించాలని తాము ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేదని చెప్పారు.

వెంకటశివపై చర్యలు తీసుకోవాలి

ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేసిన సిట్టింగ్ బెంచ్‌లను, అభివృద్ధి బోర్డులను ధ్వంసం చేయించిన పంచాయతీ కార్యదర్శి వెంకటశివపై చర్యలు తీసుకోవాలి. మళ్లీ వాటిని పునరుద్ధరించాలి. దీనికి అయ్యే ఖర్చును సైతం వెంకటశివ జీతం నుంచే వసూలు చేయాలి. ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన ప్రభుత్వ ఉద్యోగి ఎవరి మెప్పుకోసమో వాటిని ధ్వంసం చేయడం ఎంతమాత్రమూ క్షమార్హం కాదు.చంద్రగిరి నియోజకవర్గంలో ఇలాంటి విష సంస్కృతిని ప్రారంభించిన కార్యదర్శిని సస్పెండ్ చేయాలి. లేకుంటే డీపీఓ కార్యాలయాన్ని ముట్టడిస్తాం.
– విడుదల మాధవరెడ్డి, వైస్ ఎంపీపీ, తిరుపతి రూరల్


విశ్రాంత ఉద్యోగుల మాటున పచ్చ పైత్యం

విశ్రాంత ఉద్యోగుల సంఘం మాటున కొంత మందికి పచ్చ పైత్యం ముదిరింది. ప్రభుత్వ నిధులతో విశ్రాంత ఉద్యోగులకు ఓ కార్యాలయాన్ని అప్పటి ఎమ్మెల్యే డాక్టర చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి నిర్మించి ఇచ్చారన్న కతజ్ఞత చూపకుండా ఆయన పేరును ధ్వంసం చేయడం విమర్శలకు తావిస్తోంది.

- విశ్రాంత ఉద్యోగుల భవనంపై మాజీ ఎమ్మెల్యేచెవిరెడ్డి పేరు ధ్వంసం
- భవన నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే తోడ్పాటు
- భవనంపై చెవిరెడ్డి పేరు ధ్వంసంపై మండిపడుతున్న విశ్రాంత ఉద్యోగులు



భవనంపై ఉన్న అప్పటి ఎమ్మెల్యే చెవిరెడ్డి పేరు, ఉపాధి హామీ లోగోను ధ్వంసం చేసిన దృశ్యం



పేర్లను ధ్వంసం చేయడంతో ఊడిపడిన సిమెంటు ముక్కలు

చంద్రగిరి: మండల కేంద్రంలో విశ్రాంత ఉద్యోగుల సంఘానికి కార్యాలయం లేకపోవడంతో ఇబ్బందులు పడేవారు. దీంతో గత ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి దృష్టికి పార్టీ నేతలు సమస్యను తీసుకెళ్లడంతో ఆయన స్పందించారు. హామీ మేరకు కోట్లాది రూపాయల విలువైన స్థలంలో కొన్ని నెలల్లోనే అత్యాధునిక హంగులతో భవనం నిర్మించారు. ఇందుకు తుడా నిధుల నుంచి రూ.4.20 లక్షలు, ఎన్ఆర్ఈజీఎస్ నుంచి రూ.9.80 లక్షల నిధులను మంజూరు చేయించారు. అనంతరం విశ్రాంత ఉ ద్యోగులు, చెవిరెడ్డి చేసిన సాయానికి గుర్తుగా భవనంపై.. 'ప్రారంభకులు డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఎమ్మెల్యే, చంద్రగిరి' అంటూ సిమెంటు అక్షరాలతో ఏర్పాటు చేశారు. అలాగే చెవిరెడ్డి చేతుల మీదుగా భవనాన్ని ప్రారంభించారు.

సంఘం మాటున పేర్లు ధ్వంసం

దీనిని కూటమి ప్రభుత్వం జీర్ణించుకోలేకపోయింది. గత ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ఓర్వలేకపోతోంది. ఈ నేపథ్యంలో గురువారం విశ్రాంత ఉద్యోగుల సంఘంలోని కొంత మంది నేతల సహకారంతో భవనంపై ఉన్న మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి పేర్లను ధ్వంసం చేశారు. గురువారం ఉదయం సంఘంలోని ఓ నేత డ్రైవరు సహకారంతో భవనంపై సిమెంటుతో నిర్మించిన పేర్లను ధ్వంసం చేసి రాక్షసానందం పొందారు.

రేకుల ఏర్పాటుకు అభ్యంతరం తెలపడంతోనే..!

విశ్రాంత భవనం ముందు రేకుల ఏర్పాటుకు స్థానికులు అభ్యంతరం చెప్పడంతోనే ఇలా అధికార పార్టీ నాయకుల సహకారంతో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి పేర్లను ధ్వంసం చేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మూడు రోజుల క్రితం కార్యాలయం ముందు పది అడుగుల పొడవుతో రేకులను ఏర్పాటు చేసేందుకు పనులను ప్రారంభించారు. అయితే రేకులు ఏర్పాటు చేయడం వల్ల వినాయక చవితి, జాతర ఉత్సవాల్లో ఇబ్బందులు తలెత్తుతాయంటూ స్థానికులు అడ్డుకున్నారు. దీంతో సంఘం నేతగా చెప్పుకునే ఓ పెద్దమనిషి సమస్యను రాజకీయం చేసి, పేరును ధ్వంసం చేశారని తోటి విశ్రాంత ఉద్యోగులే మండిపడుతున్నారు. సంఘానికి దాతలు సహాయ సహకారాలు అందిస్తే వారు పేర్లను లిఖించడంతప్పు కాదని, ఐదేళ్ల పాటు ఉన్న పేరును ఇప్పుడు తొలగించడం ఏమిటంటూ ఆగ్రహిస్తున్నారు. సంఘం నేతగా చెప్పుకుంటూ ఇలా చేయడం అసోసియేషన్‌ను అప్రతిష్టపాల్జేస్తుందని ఆవేదన చెందుతున్నారు.

పంటలను రక్షించండి



జేసీకి వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు, రైతులు

భాకరాపేట : ఏనుగులు బారి నుంచి పంటలను రక్షించాలని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ రామానాయుడు డిమాండ్ చేశారు. గురువారం చిన్నగొట్టిగల్లులో జరిగిన రెవెన్యూ సదస్సుకు హాజరైన తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ శుభంబన్సల్ కు రైతు సంఘం ఆధ్వర్యంలో పంట నష్టపోయిన రైతులతో కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామానాయుడు మాట్లాడుతూ కొద్ది రోజులుగా చిన్నగొట్టిగల్లు మండలం చిట్టిచెర్ల, భాకరాపేట, దిగుపూరు, ఎగవూరు, పంచాయతీల పరిధిలో దాదాపు పదుల సంఖ్యలో రైతులకు సంబంధించిన టమాట, వరి, చెరుకు, వంగ, అరటి, మామిడి, సపోటా, కొబ్బరి తోటలను ధ్వంసం చేశాయన్నారు. ఈ సమస్యపై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదన్నారు. రైతులకు వెంటనే న్యాయం జరగక పోతే ఈ నెల 25వ తేదీ భాకరాపేట గాంధీ సర్కిల్‌లో ఏనుగుల భారిన పంట నష్ట పోయిన రైతులుతో ఆందోళన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బండి చలపతి, రైతులు పద్మనాభరెడ్డి, చంద్రనాయక్, హరికృష్ణ, మల్లేశ్వర్, సుధాకర్, గిరి, చెంగల్‌రాయులు, రెడ్డిసుబ్రమణ్యం, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యత ముఖ్యం



మాట్లాడుతున్న ఆర్బీఐ లీడ్ డిస్ట్రిక్ ఆఫీసర్ పూర్ణిమ

తిరుపతి రూరల్: ప్రతి ఒక్కరికీ ఆర్థిక అక్షరాస్యత ముఖ్యమని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లీడ్ డిస్ట్రిక్ ఆఫీసర్ పూర్ణిమ అన్నారు. తిరుపతి రూరల్ మండలం తనపల్లె వెలుగు కార్యాలయంలో గురువారం ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పూర్ణిమ మాట్లాడారు. ప్రతి కుటుంబం నుంచి ఒక వ్యక్తి వ్యాపారవేత్త కావాలన్నదే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ధ్యేయమన్నారు. ఈ దిశగా పొదుపు, భద్రత, ఆర్థిక లావాదేవీలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బ్యాంకు ఆవశ్యకత, లావాదేవీలు, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ విశ్వనాథ్ రెడ్డి అన్నారు. అనంతరం ప్రభుత్వాల సంక్షేమ, ఆర్థిక భరోసా పథకాలు, వాటిని పొందడానికి అర్హతలను డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు వివరించారు. వెలుగు ఏపీఎం నాగేశ్వరరావు, రమేష్, చెంచ య్య, మహిళా సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నా రు.

51 మందికి జరిమానా

తిరుపతి లీగల్: నగరంలో ప్రజల రాకపోకలకు, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తూ వ్యాపారాలు నిర్వహిస్తున్న 51 మందికి రూ.25,500 జరిమానా విధిస్తూ తిరుపతి మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి సంధ్యారాణి గురువారం తీర్పు చెప్పారు. ఆ వ్యాపారులపై ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు కోర్టులో హాజరు పరచడంతో న్యాయమూర్తి జరిమానా విధించినట్లు ట్రాఫిక్ కానిస్టేబుల్ గిరిబాబు తెలిపారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు 1,122 మందిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరపరచగా కోర్టు వారికి రూ.3,81,300 జరిమానా విధించిందని చెప్పారు.

ఇంధన పొదుపుపై అవగాహన ర్యాలీ

- ఎస్పీడీసీఎల్ తిరుపతి సర్కిల్ ఎస్ఈ సురేంద్రనాయుడు



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్పీడీసీఎల్ తిరుపతి సర్కిల్ ఎస్ఈ సురేంద్రనాయుడు

తిరుపతి రూరల్: విద్యార్థి దశ నుంచే ఇంధన పొదుపుపై అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు ఎస్పీడీసీఎల్ తిరుపతి సర్కిల్ ఎస్ఈ సురేంద్రనాయుడు అన్నారు. జాతీయ విద్యుత్ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా గురువారం ఎస్ఈ కార్యాలయం నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ప్లకార్డులు, బ్యానర్లతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని జెండా ఊపి ప్రారంభించి ఆయన మాట్లాడారు. ప్రతి ఏటా డిసెంబర్ 14 నుంచి 20వ తేదీ వరకు జాతీయ విద్యుత్ ఇంధన పొదుపు వారోత్సవాలను దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కరెంటు ఆదా చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలు, కరెంటు ఆదా చేయడం వల్ల భావితరాలకు ఇంధన వనరులను అందించేందుకు కలిగే అవకాశాలపై స్కూల్ స్థాయి నుంచే అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ర్యాలీలో తిరుపతి రూరల్, టౌన్ డివిజన్ ఈఈలు వాసురెడ్డి, చంద్రశేఖర్, వాసవీలత, సిబ్బంది పాల్గొన్నారు.

ధనార్జనే లక్ష్యంగా రుయా షాపుల టెండర్లు

- రూ. 6వేల బాడుగ షాపును రూ. 60 వేలు చేసి వెళ్లగొట్టారు
- బాధితురాలు శాంతారెడ్డి నివేదన'



బాధితురాలు శాంతారెడ్డి

తిరుపతి కల్చరల్: ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో పేదల ప్రజల సంక్షేమాన్ని విస్మరించి ధనార్జనే లక్ష్యంగా రుయా ఆస్పత్రిలోని షాపులను టెండర్ల ద్వారా కేటాయిస్తూ లక్షల దోపిడీకి పాల్పడిందని బాధితురాలు శాంతారెడ్డి ఆరోపించారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రుయాకు రోజూ వేలాది మంది పేదలు వైద్యం కోసం వస్తుంటారని, ఇక్కడ ఇష్టారాజ్యంగా లక్షల రూపాయలకు టెండర్ల ద్వారా షాపులు కేటాయించి దోపిడీకి తెరలేపారని విమర్శించారు. గతంలో అప్పటి ఎమ్మెల్యే రుయాకు వచ్చే రోగులను దృష్టిలో ఉంచుకొని తక్కువ బాడుగలకు షాపులు కేటాయించారన్నారు. అందులో ఒంటరి మహిళ అయిన తనకు కూడా తక్కువ బాడుగతో షాపు ఇచ్చారన్నారు. గతంలో తాను నిర్వహించే టీ దుకాణానికి రూ.6,400 బాడుగ చెల్లించేదానిని, ప్రస్తుతం అదే షాపును రూ.60 వేలకు టెండర్ పెట్టి, తన కడుపు కొట్టి, షాపును లాక్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ప్రస్తుత ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. షాపుల టెండర్లతో రుయా ఆసుపత్రి యాజమాన్యం, జనసేన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు వసూళ్లకు తెరతీశారని ఆరోపించారు. జిల్లా అధికారులు రుయా షాపుల టెండర్లను రద్దు చేసి, నామమాత్రపు బాడుగలతో కేటాయించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ కాస్త పెరిగింది. క్యూ కాంప్లెక్స్‌లో 16 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 70,457 మంది స్వామి వారిని దర్శించుకోగా 22,152 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.16 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలో దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 15 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం కల్పిస్తున్నారు. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్‌లో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

రేపు ప్రపంచ ధ్యాన దినోత్సవం



మాట్లాడుతున్న, కంచి రఘురామ్

తిరుపతి కల్చరల్: తిరుపతి స్పిరిచువల్ సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 21న శనివారం ఉదయం 10 గంటలకు అన్నమాచార్య కళామందిరంలో ప్రపంచ ధ్యాన దినోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నట్లు సొసైటీ అధ్యక్షుడు కంచి రఘురామ్ తెలిపారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ధ్యాన గురువు బ్రహ్మర్షి పత్రీజీ సూచనలతో 1994లో తిరుపతి స్పిరిచువల్ సొసైటీ ఏర్పాటు చేసి 30 ఏళ్లుగా ధ్యానం విశిష్టతను, దాని ఉపయోగాలపై ఎన్నో కార్యక్రమాలతో ప్రజల్ని చైతన్యవంతుల్ని చేస్తున్నట్టు చెప్పారు. ఐక్యరాజ్య సమితి పిలుపు మేరకు ప్రతి ఏటా డిసెంబర్ 21న ప్రపంచ వ్యాప్తంగా ఈ ప్రపంచ ధ్యాన దినోత్సవం నిర్వహించడం ఆనవాయితీ అని, తిరుపతిలో నిర్వహించే వేడుకల్లో నగర ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో తిరుపతి స్పిరిచువల్ సొసైటీ ప్రతినిధులు జయరాంరెడ్డి, సుబ్బలక్ష్మి, భాస్కర్, ప్రవీణ్‌కుమార్, రామదాస్ పాల్గొన్నారు.

హోంమంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి





అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న దళిత, ప్రజా సంఘాల నేతలు, అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజా, యువజన, విద్యార్థి సంఘాల నాయకులు

- దళిత ప్రజాసంఘాల నేతలు డిమాండ్

తిరుపతి కల్చరల్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేద్కర్‌పై పార్లమెంట్ సాక్షిగా అనుచిత వ్యాఖ్యలు చేసి, హేళన చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని పలువురు దళిత, ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ దళిత, ప్రజాసంఘాల నేతలు గురువారం ఆర్టీసీ బస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. రిపబ్లికన్ పార్టీ దక్షిణ భారత అధ్యక్షుడు పి.అంజయ్య, అంబేడ్కర్ భవన్ కమిటీ చైర్మన్ పి.పరమశివన్, టీటీడీ ఎస్సీ,ఎస్టీ ఉద్యోగల సంఘ నేత ఎం.ప్రసాద్‌రావు, ప్రజాసంఘాల నేత చిన్నం పెంచలయ్య మాట్లాడారు. పార్లమెంట్‌లో రాజ్యాంగంపై ప్రమాణం చేసి హోం మంత్రిగా సాగుతున్న అమిత్‌షా బాధ్యతా రహితంగా అంబేద్కర్‌ను హేళన చేయడం శోచనీయమన్నారు. మతోన్మాద అగ్రకుల అహంకారంతో కోట్లాది మంది దళిత, ఆదివాసి, బడుగు, బలహీన వర్గాల ప్రజల మనోభావాలను ఆయన దెబ్బతీశారని మండిపడ్డారు. కార్యక్రమంలో దళిత సంఘ నేతలు జి.ధనశేఖర్, పి.ప్రభాకర్, బలరాం, చిరంజీవి, వివిధ దళిత సంఘాల నేతలు, ప్రజా సంఘాల నేతలు పాల్గొన్నారు. అలాగే హోం మంత్రి అమిత్‌షా అంబేడ్కర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ పార్టీ నేతలు కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు.



అంబేద్కర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న దళిత బీసీ కాపు సంఘం నాయకులు

ఎస్వీయూ ప్రధాన ద్వారం వద్ద..

తిరుపతి సిటీ: కేంద్రమంత్రి అమిత్‌షా అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని దళిత బీసీ కాపు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ శివకాపు మండిపడ్డారు. గురువారం ఎస్వీయూ ప్రధాన ద్వారం వద్దగల అంబేద్కర్ విగ్రహానికి క్షమాపణ కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ, దళిత, బీసీ, కాపు సామాజిక వర్గం ఓట్లతోనే కూటమి ప్రభుత్వం, దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిందనే విషయం అమిత్‌షా గుర్తు చేసుకోవాలన్నారు. బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను దేవుడా? అనే విధంగా అమిత్‌షా మాట్లాడటం సరి కాదని ఖండించారు. ఆయన సభాముఖంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు జయరామయ్య, నరేంద్ర యాదవ్, సభ్యులు పాల్గొన్నారు.

ప్రజా, యువజన, విద్యార్థి సంఘాల నిరసన

తిరుపతి సిటీ: పార్లమెంట్‌లో అమిత్‌షా ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ, అంబేద్కర్‌ను అవమానకరంగా మాట్లాడిన తీరు అభ్యంతరకరమని, వెంటనే మంత్రి వర్గం నుంచి ఆయను తొలగించాలని ప్రజా, యువజన, విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఎస్వీయూ ప్రధాన ద్వారం వద్దగల అంబేడ్కర్ విగ్రహం వద్ద వారు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. కేంద్ర హోం శాఖ మంత్రి అంబేద్కర్‌ను వ్యంగ్యంగా మాట్లాడటం దేశప్రజలను అవమానించడమేనని మండిపడ్డారు. యావత్ భారతీయులకు ఆయన వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్, అఖిల భారత అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు చింతమాకుల పుణ్యమూర్తి, ఎస్వీయూ వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షులు మన్నం ప్రేమ్ కుమార్, జాతీయ న్యాయ విద్యార్థుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు సుందరరాజు, ఏపీ విద్యార్థి హక్కుల సంఘం సెక్రటరీ ముని, యువజన సంఘ నాయకులు, విద్యార్థి సంఘ నాయకులు, ఉద్యోగ సంఘ నాయకులు పాల్గొన్నారు.

వన్ బై త్రీ ..!

- ఒకే హాలులో ఓ వైపు శిక్షణ, మరోవైపు డ్యూటీలు!



హెవీ లైసెన్స్ కోసం శిక్షణ పొందుతున్న డ్రైవర్లు

తిరుపతి అర్బన్: అలిపిరి డ్రైవింగ్ స్కూల్‌లో హెవీ లైసెన్స్ కోసం శిక్షణ ఇస్తున్న హాలును వివిధ రకాలుగా వినియోగిస్తుండడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. డిపోలో పనిచేస్తున్న ఉద్యోగులకు డ్యూటీలు కేటాయింపులకు కూడా ఈ హాలును వాడుతున్నారు. దీంతో ఓ వైపు శిక్షణ ఇస్తుంటే...మరోవైపు ఆర్టీసీ అధికారులు సిబ్బందికి డ్యూటీలు వేస్తున్నారు. దీంతో శిక్షణ పొందుతున్న వారు క్లాస్‌లు సక్రమంగా అర్థంకాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. అలిపిరి డిపోలో 2020 నుంచి డ్రైవింగ్ స్కూల్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో డిపో మేనేజర్ కార్యాలయం సమీపంలోని ఓ హాలును డ్రైవింగ్ స్కూల్‌కు కేటాయించారు. రోజూ హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కోసం ఆ ఇక్కడ నిర్వాహకులు క్లాస్‌లు తీసుకుంటారు. నాలుగేళ్లుగా ఇబ్బందులు లేకుండా డ్రైవింగ్ స్కూల్ సాగుతోంది. అయితే నెల రోజుల నుంచి అదే హాల్‌లో డిపోలో పనిచేస్తున్న డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్స్, ఇతర సిబ్బందికి డ్యూటీలు వేయడానికి ఇద్దరు అధికారులకు ఆ హాల్‌లో ఓ వైపు కేటాయించారు. దీంతో హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కోసం శిక్షణ తీసుకుంటున్న వారు ఇబ్బందులు పడుతున్నారు.

30 వ బ్యాచ్‌కి శిక్షణ

తిరుపతి అలిపిరి ఆర్టీసీ డిపోలో ప్రస్తుతం 30వ బ్యాచ్‌కి శిక్షణ ఇస్తున్నారు. ఈ నెల 25 నాటికి ఈ బ్యాచ్ శిక్షణ పూర్తవుతుంది. దీంతో ఇప్పటివరకు 480 మందికి శిక్షణ ఇచ్చినట్లు లెక్క. వారిలో చాల మందికి స్థానికంగానే ఆర్టీసీలో ఉద్యోగావకాశాలు కల్పించారు. 31వ బ్యాచ్‌కి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. జనవరి మొదటి వారంలో 31వ బ్యాచ్‌కి శిక్షణ ప్రారంభించనున్నారు.



డ్రైవింగ్ స్కూల్‌కు కేటాయించిన హాల్‌లోనే డ్యూటీలు వేయడానికి అధికారులకు మరోవైపు కేటాయింపు